

అవసరాల రామకృష్ణారావు

సుందర్రామ్మూర్తికి కూతురికి
జవాబు చెప్పుకోడం పెద్ద కష్ట
మేమీ కాదు. 'చూడు రాధీ! ఈ
నెల అనుకోని ఖర్చులు తగులు

కున్నాయి. వందకంటె ఎక్కువ
పంపలేకపోయాను. నీ దగ్గర
ఉన్నది వేసి ఏదో సాదా చీర
కొనుక్కో. అల్లుడుగారి నుంచి


మాట రాకుండా ఈ సంక్రాంతి ఎలా దాటిస్తావో నీదే భారం. ఉగాదికి తప్పకుండా కంచీవరం పట్టుచీర కొంటాను. సరేనా!' అని రెండు ముక్కలు వ్రాస్తే చాలు, ఏమీ అనుకోదు.

ఆఖరికి మెడికల్ కాలేజీలో ఫోర్తియర్ చదువుతున్న కొడుక్కయినా సరే 'ఎలాగో మరో నెల ఓపిక పట్టు బాబూ! తప్పకుండా నీకు టెన్నిస్ రేకెట్ కి డబ్బు పంపిస్తానుగా' అని సమాధాన పరచ గలడు.

పిల్లలిద్దరూ తన మాట అర్థం చేసుకునే వయసు చేరుకున్నారు. ఇద్దరు పిల్లల్తోనే సరిపెట్టుకునే గడుసుదనం ఏ నాడో ప్రదర్శించాడు గనుక 'ఇక పిల్లల బాధ లేదతనికి' అని ఎవరైనా అనుకుంటే అది పొరపాటే. అందరికంటె కుర్రది తన పీకల మీద ఎప్పుడూ ఉండనే ఉంది. 'గుండెల మీద కుంపటి'ని కట్నపు లంచం ఇచ్చి 'మరో ఇల్లు అంటించు తల్లీ!' అని దీవించి రెండేళ్ళ సాగనంపేడు.

'నెత్తి మీద ఇంత కొరివి పెట్టే' ఘటాన్ని 'ఆ పని అక్కడే అందాకా ప్రాక్టీసు చెయ్యి' అని సలహా యిచ్చి నాలుగేళ్ళ పట్నం తరలించాడు. కాని కట్టుకున్న భార్యామణి 'నిత్యాగ్ని హోత్రంలా' ఏ రోజు కా రోజు నిత్య నూతనంగా ప్రజ్వరిల్లి పోతూంటే, ఏమంటూ ఎక్కడికి పంపించెయ్యగలడు?

ఎక్కడికైనా పంపెయ్యడం మాట దేవుడెరుగు, ఎదురుగా నిల



ఒడి గట్టిగా మాట్లాడ్డానికయినా ఏనాడూ దమ్ములేవు సుందరామ్మూర్తికి.

ఇంత పొడుగున అటూ ఇటూ దిద్దబడిన కాటుక రేఖలే కాదు. కను వెంట్రుకలు కూడా ఆమె సొంతం కాదు. పువ్వులే కాదు, వాటి కింద అటూ ఇటూ కదులుతున్న ఇంత పొడుగు వాలు జడలో చాలా భాగం ఆమె సొంతం కాదు. 'తెలుపే కాబోలు' అనిపించే ఆ ఒంటిరంగు గాని 'ఏదీ ఇంకా ముప్పై అయినా వెళ్ళందే!' అని చెప్పుకునే వయసుగాని, ఆమెవి కానేకావు. ఇవన్నీ స్పష్టంగా తెలిసి, వీటికి అయ్యే ఖర్చు భరించలేక చాటుగా ఎంత గింజుకుంటేనేం, అదేం ఖర్మమో ఆమె ఎదుట పడితే చాలు అతను అతనే కాదు!

సుందరామ్మూర్తి ఇలాంటి వాటికి కొత్తగా బాధ పడవలసిన అవసరం ఏమీ లేదు. ఈ రకం అనుభవానికి రజతోత్సవం జరిగి నాలుగో ఏడు నడుస్తోంది. ఎలాంటి వ్యధకయినా అలవాటు పడిపోడానికి వ్యవధి ఎక్కువే. కాని ఎప్పటి కప్పుడు కొత్త సమస్య సృష్టించి అతనికి మనశ్శాంతి లేకుండా చెయ్యడానికి ఆమెకు ఆమే సాటి.

ఎంతగా రోజుకి మూడొంతుల కాలం పైన గడిపేసినా కొన్ని గంటలయినా అతనికి ఇంట్లో గడపక తప్పదు. నలుగురూ వచ్చే పోయే కొంప. ఇంటికొచ్చిన వాళ్ళకి గౌరవ మర్యాదలు జరపక పోతే పోయే, శాపనార్థాలు తగలకుండా క్షేమంగా వాళ్ళిళ్ళు చేర్చవలసిన పూచీ యింటి యజమానిదే గదా! అదీ గాక ఇప్పుడిప్పుడు కంట్రాక్టు పని తనకి బాగా దొరుకుతోంది. పడకగది పల్నాటి యుద్ధ సీమ అయితే అది కట్టుకున్న వాడి కర్మ. డ్రాయింగురూముని కూడా కురుక్షేత్రంగా మార్చక మానానంటే ఎవరైనా గుమ్మం తొక్కుతారా? పార్టీలకి ఏ హోటల్సులోనో డిన్నర్లు ఇప్పించడం సులువేగాని, ఓ సారైనా యింటికి పిలిపించి యిన్ని కాఫీ నీళ్ళు పోయించక పోతే, తనకీ ఎదిగిన కూతురూ, కొడుకూ ఉన్నారు. సోషల్ స్టేటస్ ఏం కావాలి?

ఉన్న బాధలు చాలక పీకల్దాకా తెగిపోయే వ్యవహారం ఒకటి వచ్చి పడింది సుందరామ్మూర్తికి. ఎంత ఆలోచించినా దాని పరిష్కారం అతనికి బోధ పడలేదు.

ఆ ఊళ్ళోనే అతని బంధువుల యింట్లో పెళ్ళయింది. ఆడపెళ్ళి

వారు. సుందర్రామ్మూర్తి అన్న సూర్నారాయణ పెళ్ళానికి దగ్గర చుట్టాలు. సూర్నారాయణకి ఆఫీసులో శలవు దొరక్క రావడం కుదర్లేదట. పిల్లలకి పరీక్షలట. పెళ్ళాం రోజారాణిని ఒక్కర్తినీ పంపించాడు. సొంత వదినగారు ఊళ్ళోకి వచ్చినా ఓ పూట తన యింటికి పిల్చి పట్టెడన్నం పెట్టి ఇంత పసుపూ కుంకుం ఇచ్చే సావకాశం సుందర్రామ్మూర్తికి ఎప్పుడూ లేదు. అతని పెళ్ళాం భ్రమరాంబ పేరు ప్రతిష్ఠలు జిల్లా దాటి చాలా రోజులయింది గనక. రోజారాణి అందుకు ఆశించిందీ లేదు. సరాసరి పెళ్ళి వారింట్లో దిగి అక్కణ్ణుంచి అలాగే స్టేషనుకి వెళ్ళిపోయే ఏర్పాటుతోనే ఆ ఊరొచ్చింది రోజారాణి.

తోడి కోడళ్ళిద్దరూ పెళ్ళి పందిట్లోనే కలుసుకున్నారు.

ఓ మారు ఎగాదిగా చూసింది ఆమెని భ్రమరాంబ.

పక్కనే ఉన్న ముసలమ్మ ఏదో అంది. అంతే!

తనూ పక్కనే ఉన్నాడు. మరి ఆమెకి ఏం బాధ కలిగిందో తెలీదు.

మాటి మాటికీ కళ్ళజోడు తీసుకొని కళ్ళని అలా తుడుచుకుంటూనే ఉంది. పట్టుచీర కొంగుతో



ముక్కు తుడుచుకుంటూనే ఉంది. 'ఏం జరిగింది పాపా! నిన్నెవరేమన్నారు?' అని అతను అడగలేదు. అలా అడిగితే వచ్చే ప్రమాదం అతనికి అనుభవమే. కారుమేఘాలు కమ్ముకొస్తున్నట్టు అతని గుండె మాత్రం దడదడ కొట్టుకుంది. మరి ఎలా ఉగ్గబెట్టుకుందో ఆ నాలుగు అక్షింత గింజలూ పడేదాకా ఆగింది. అంతే. ఎవరెంత బతిమాలినా పెళ్ళి భోజనానికి ఆగలేదు.

ఇల్లు చేరడమే ఏటి భోరుమని మంచం మీద పడి పోవడమేమిటి! మొగుడికే పట్టకపోయాక ఇంకెందుకంది. అన్నం హితవు మాట దేనికి.

తనకి జీవితేచ్ఛే పోయింది పొమ్మంది. అంత మందిలో అంత అవమానం జరిగేక ఇంకెందుకు బతకాలో చెప్పమంది. సుళువుగా తొందరగా ప్రాణం తీసే సాధనం ఏవుందో అని వెంటనే పట్టుకొచ్చి ఆ ఒక్క పుణ్యమూ కట్టుకోక తప్పదని మొగుణ్ణి రెండు చేతులూ ఎత్తి ప్రార్థించింది. 'ఇవ్వండి. పిల్లలికి వెంటనే పైరివ్వండి' అంది.

ఆ పెళ్ళి హడావిడిలో తను సరిగా వినలేదుగాని-

రోజారాణినీ, భ్రమరాంబనీ గుచ్చి గుచ్చి చూసిన ఓ బామ్మగారు ఆ కాస్త మాటా పుసుక్కున అననే అరడిట. "ఇది మీ తోడి కోడలు రోజా కాదుటే భ్రమరం! ఎన్నాళ్ళైందో మిమ్మల్నందర్నీ నేను చూసి. రోజా గురించే గదూ నువ్వు చెప్పే దానివి. 'మా బావగారి పెళ్ళాం నా కంటె సహస్రాంతం పెద్దదయినా చిన్నదాన్నని ప్రచారం చేస్తోంది చూడు దొడ్డమ్మా!' అనీ. నీ మాట రైటు కాదు సుమీ! ఏదైనా కళ్ళ తోటి చూడాలి. అనుకోవాలి. మీ యిద్దర్నీ యిలా పక్క పక్కన చూస్తూంటే నువ్వే పెద్దదానివని స్పష్టంగా తెలిసిపోతోంది సుమీ! ఎంత దాచినా ముసలిరూపు నీ కళ్ళజోడులోంచి కొట్టొచ్చినట్టు బయట పడిపోడం లేదు మరీ? చురుకుగా చూస్తేలూ అదీ నీ తోడి కోడలూ ఉంది మరి. నీ కంటె పెద్దదే అయితే దానికి చత్వారపు జోడు ఏదీ?"

బామ్మగారి మాటలకి గొల్లుమంది పందిరంతా. మైకులో రికార్డులు, మంత్రాలు, వాయద్యాలు. అయినా, సరే ప్రతి ఒకరి నవ్వూ గుండెని ముక్కముక్కలు చేస్తూ భ్రమరాంబ చెవిలో పడింది. ఆమె కోపం బామ్మగారి మీద కాదు. రోజారాణి మీద కాదు, నవ్విన వాళ్ళ మీదా కాదు. 'ఈ కళ్ళజోడు పెట్టుకుని నేనా పెళ్ళి పందిట్లోకి అడుగెట్టలేను. ఎంతో పెద్దదాన్లా కనబడతాను. మామూలుగా వచ్చేస్తాను.' అని పాపం ఆమె శత విధాలుగా బయల్దేరక ముందే చెప్పింది మొగుడితో.

సుందర్రామ్మూర్తి చెప్పదలచుకున్నది ఇదీ:

"మొన్న మనం బజారుకి వెళ్ళాం గుర్తుందా? కళ్ళజోడు పెట్టుకోకుండా వచ్చావు నువ్వు. గజం దూరంలో కిళ్ళీబడ్డీని చూపించి 'ఏమండోయ్ ఖాళీ రిక్షా వస్తున్నట్టుంది. ఆపకూడదూ?' అన్నావు నువ్వు.

అంతగా నీ సైటు పెరిగిపోయింది. కళ్ళజోడు అంటే నీకెంతఎలర్జీయో నేనెరగంద్ది కాదు. మొహం మీద కాదుకదా ఎదురుగుండా అలమరలో అయినా పెట్టవ్. 'ఏమండీ! ఇది మీదా?' అని ఎవరైనా అడుగుతారు అని నీ కనుమానం. కాని నిన్ను తీసుకుని కళ్ళజోడు లేకుండా, అంత రద్దీగా ఉండే ఆ పెళ్ళి పందిట్లోకి ఎలా వెళ్ళడం? పోనీ మానేద్దాం అంటే మొన్న మొన్ననే మద్రాసు వాణీ సిల్కు ఎంపోరియం నుంచి తెప్పించుకున్న కొత్త ఫేషన్ పట్టు చీరలు నలుగురికీ చూపించే అవకాశం ఎలా జారవిడుచుకోగలవు? పోనీ అలాగేనా వస్తావా? టక్కు టక్కుమంటూ నాలుగేసి అంగుళాల హై హీల్సు జోడు ఒకటీ. ఎంతమందిని తొక్కేస్తావో, ఎంతమందికి నేను సారీ చెప్పుకోవాలో. కళ్ళజోడు పెట్టుకుంటే పెద్ద వయసుది అనుకుంటే అదే పోయె. కళ్ళజోడు లేకుండా నేను చెయ్యి పట్టుకు నడిపిస్తే అందరూ నిన్ను జబ్బు మనిషి అనుకుంటే!?'

ఊళ్ళోపులీ, పెళ్ళాం దగ్గరపిల్లీ అయిన సుందర్రామ్మూర్తి లాంటి వాళ్ళకి ఇంకా అన్నీ అందామని ఉంటుంది గాని నోరు ఎలా పెగుల్తుందీ! ఉన్నదున్నట్లు ఎటువంటి పరిస్థితుల్లో అయినా సరే భ్రమరాంబ ఒప్పుకునే రకం కాదని ఆమె కాపరానికి వచ్చిన మొదట్లోనే గ్రహించాడతను. కంట్రాక్టులుచేసి ఇల్లు నింపుకునే సమర్థతగల అతనికి ఎత్తులూ, జిత్తులూ ఉపయోగించడంకొత్తవిద్యేంకాదు. అయితే మంత్రం అనేది ఎప్పుడూ పారుతుందని గ్యారంటీలేదు. ఒక్కొక్కప్పుడు బెడిసి కొట్టవచ్చుకూడా. అయినా ఏమైతే అయిందని చిన్న చిట్కా ప్రయోగించాడు. "నేను చెబితే నమ్మవు మరి. మొన్న కళ్ళ డాక్టరు ఇచ్చిన ఫ్రేము నీ మొహానికి ఎంతో బాగా నప్పింది. ఓసారి అద్దం చూసుకో, ఎంత చిన్న దాన్లా కనిపిస్తున్నావో"-అంతే! చెంగున లేచి పోయింది భ్రమరాంబ. వెంటనే ముస్తాబుకు ఉపక్రమించింది. పబ్బం గడిచిందని ముచ్చట పడినంత సేపు పట్టలేదు. ఆయాసంతో బాధపడుతున్న వాడి నోట్లో ఎవరేనా మంత్రించిన విభూతి ఇస్తే, ఎంతో ఆశతో వేస్తాం. వాడు అది గొంతుక దిగక ఉక్కిరి బిక్కిరై హరీమంటాడని ముందే ఊహించలేం గదా!

"వద్దు మొర్రో అంటే మీరే లేని పోనివి చెప్పి నా కన్ను గప్పి

ఆ దిక్కుమాలిన కళ్ళ జోడు పెట్టించారు. ఈనాడు పదిమందిలో నా తల కొట్టేసి నట్టయిందంటే దానికి మూలం మీరు కాదూ? కట్టుకున్న మొగుడికే ఇంత కనికిష్టం అయినప్పుడు ఈ దిక్కుమాలిన బతుకుమీద ఇంకా ఇంకా వ్యామోహం ఎందుకు? నన్నింక అడ్డుపడకండి. ఇంత విషం నా మోహాన్ని కొట్టి ఇక్కణ్ణుంచి దయచేయండి. పిల్లలిద్దరికీ వైరు చెయ్యండి పుణ్యముంటుంది. తల్లి శవాన్నయినా కళ్ళతో చూసుకుంటారు"

మరో మారు. ఘొల్లు మంది భ్రమరాంబ.

డ్రాయింగ్ రూంలోకి వచ్చి తల పట్టుకు కూచున్నాడు సుందరరామ్మూర్తి. ఫోన్ మోగింది. తీశాడు. పీ. డబిల్‌యూ. డీ. ఎక్జిక్యూటివ్ ఇంజనీరు ఫోన్ చేశాడు. ఛీఫ్ ఇంజనీర్‌తో పాటు మినిస్టరు కూడా వస్తున్నాడట ఆ రాత్రి డిన్నరుకి. "యు ఆర్ వెరీ లకీ. ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయిగా?" అంటూ నవ్వుతూ పెట్టేశాడు. ఆ మాట వింటూనే సుందరరామ్మూర్తికి ముచ్చెమటలు పోశాయి.

ఈ దిక్కుమాలిన గొడవలో తల మునకలై అతను ఆ సంగతే మరచి పోయాడు. ఎంత పొరపాటు-ఎంత పొరపాటు జరిగింది!

ఆ రాత్రి తన యింట్లోనే ఇంజనీరింగు స్టాఫు కందరికీ డిన్నరు! గంట పెళ్ళికి ఆరు రకాల ఖరీదైన చీరలు పట్టుకుని పెళ్ళికి బయలు దేరింది భ్రమరాంబ. తోడికోడలితో కబుర్లు చెబుతూ, పెళ్ళి వేడుకలు చూస్తూ, కనీసం ఆ ఒక్కరాత్రి అయినా పెళ్ళి వారింట్లో ఉండిపోతుందను కున్నాడు. ఆ ధైర్యం ఉండబట్టే ఇంట్లో డిన్నరుకి ఏర్పాటు చేశాడు. హాస్పిటలుకి శాంక్షనయిన కొత్త బిల్డింగుకి కంట్రాక్టు సంపాదించడానికి ఇదే అదను. దీనితో తన అప్పులన్నీ తీరిపోవాలి. ఇంట్లో అయితేఎంతసేపైనా ఉంచొచ్చుననీ ఏదైనా మాట్లాడవచ్చుననీ ఎన్నెన్నో కలలు గన్నాడు. ఇప్పుడెలా? ఇంటి దాని నాలిక ఉచ్చం నీచం, చిన్న పెద్దా, లాభం నష్టం ఇన్ని రకాలు ఎరగదు. దిక్కుమాలిన పెళ్ళికి ఎరక్కపోయి తీసికెళ్ళాడు. కింద మంటేగాక నెత్తిమీద నిప్పుల పళ్ళెం బోర్లించిన మినప రొట్టెలా ఉడికి పోతోంది భ్రమరాంబ. నలుగురూ వచ్చినప్పుడు చెలరేగిపోతే పరువుమాట దేవుడెరుగు, తన

బతుకు తెరువేం కావాలి?

దరిద్రగొట్టు కళ్ళజోడు ఎంత పని చేసిందీ-అనుకుంటూ అతను అప్రయత్నంగా ఎదుట బల్ల మీద వార పత్రికలోని కంటక్టు లెన్సు ఎడ్వర్‌టైజ్ మెంటు చూశాడు. మరో మారు దాన్ని దగ్గిర పెట్టుకుని మళ్ళీ మళ్ళీ చదివాడు.

అంతే.

అలవాటయిన అతని వ్యవహార దక్షత నిమిషాల మీద పనిచేసింది.

పోయిన ప్రాణం లేచి వచ్చినట్టయింది.

వెంటనే పెళ్ళి వారింటికి పరిగెత్తి ఆ బామ్మగారిని పట్టుకున్నాడు. వేరే పక్కకి తీసికెళ్ళి మాట్లాడేడు. ఈ ఉపకారం చేసి పెట్టక తీరదని రెండు చేతులు పట్టుకున్నాడు. తిరుపతికి రిటర్న్ టిక్కెట్టు కొని అవి చేతిలో పెడితే గాని ఇంత దురంతం నా వల్ల కాదండి బామ్మగారు. వెంటనే రైలు స్టేషనుకి పరిగెత్తక తప్పలేదు సుందర్రామ్మూర్తికి. వస్తూనే బామ్మగారికి ఏం చెయ్యాలో మళ్ళీ మళ్ళీ రిహార్సలు యిచ్చి "ఊళ్ళోకి ఇన్‌కమ్ టాక్సు ఆఫీసర్లు వచ్చారు వాళ్ళకి నచ్చచెప్పడంలో ఎంత టైమూ చాలడం లేదు. నే వచ్చేసరికి ఆలశ్యం కావొచ్చు" అని ఇంటికి ఫోన్ చేశాడు.

ఇంకో అరగంటకి వాళ్ళింటి ముందు రిక్షా ఆగింది. బామ్మగారు దిగింది. దిగుతూనే భ్రమరాంబ గదిలోకి వెళ్ళింది. "ఆదేవిటే భ్రమరం! భోజనమైనా చెయ్యకుండా వచ్చేశావూ? అందరూ నువ్వు ఉండలేదేమని నొచ్చుకున్నారుసుమా! ఏం వండ్లో బాగు లేదా? అబ్బాయి ఏడీ కనపడ్డూ?" అని "గుడ్డిముండని తెలిసీ తెలియక ఏం నొప్పించానో ఏమిటో నిన్ను....అయినా చెప్పి పెట్టిన బుద్ధులూ, కప్పి పెట్టిన పద్దులూ కంపు కొట్టకుండా ఎన్నాళ్ళు ఆగుతాయిలే! సత్యం అనేది ఆ సూర్నారాయణ మూర్తిలాంటిదనుకో. ఇప్పుడో ఇంకాస్సేపటికో సూటిగా కళ్ళల్లోకి కొట్టక మానదు" అంటూ మొదలెట్టింది. అప్పటికే చెబుతున్నదేదో కాస్త ఇంట్రస్టింగ్‌గా తోచి భ్రమరాంబ ఇటుతిరిగి, "ఏమిటీ మీరు అంటున్నదీ?" అని అడిగింది హీనస్వరంతో.

"అయ్యో! ఇంకా ఏంటని అడుగుతావేమిటి భ్రమరం.... ఇంత తెలివైన ముండని నన్నే తోసిరాజు చేసిందే, మీ తోడికోడలు! అయితేనేం? నిజం పరమాత్మ స్వరూపం తల్లీ! దాన్ని

బంధించలేం. ఇంకా ఆలశ్యం ఎందుకూ? నా కళ్ళతో నే చూసింది నీకు చెబితేగాని ఉండ బట్టక ఇంత ఎండవేళా రిక్షా కట్టించుకు వచ్చేశానమ్మాయ్! చెబుతా విను. నువ్వు వెళ్ళిన అరగంటకి భోజనా లకి కేకేశారే భ్రమరం. కాళ్ళు కడు క్కుందామని అందరూ అటు వెళ్ళినా నీ తోడికోడలు ఇంకా అక్కడే తచ్చాడుతోంది. చటు క్కున లోపలి గదిలోకి తప్పు కుంది. ఏం చెప్మా అని చేరేసిన తలుపు చప్పుడు చెయ్యకుండా తీసి, నేనూ లోపలికి వెళ్ళేనమ్మాయ్. ఆ లోపలికి వెళ్ళి నే చూసిన దృశ్యముంది భ్రమరం. ఇక జన్మ జన్మలకీ మరచిపోననుకో." ఆ సరికి భ్రమరాంబ మంచం మీంచిలేచి ఎదురుగుండా కుర్చీ మీదకి వచ్చే సింది—"మీరు చూసిందేమిటి బామ్మగారూ? ఏమిటో చెప్పరూ వెంటనే?" అందిగబగబా. "చూడూ! పళ్ళెంలా ఉండి పైన అద్దం ఉంటుంది గదుల్లో గోడలకీ. ఏమిటి దాని పేరూ....ఏమిటో నా నోరు తిరగదు బాబూ!"

"వాష్ బేసినా ఏమిటి?"

"అవునవును. అదే, అదే. దాని అద్దం ముందు నిలబడింద మ్మోయ్ నీ తోడికోడలు. కళ్ళల్లో కాటిక పెట్టుకుంటాం చూసు అలా రెండు వేళ్ళూ రెండుకళ్ళ ల్లోకి పెట్టుకుంది. ఇలా లాగింది. అంతే. రెండు చిన్న ప్లాస్టిక్ల్లాం టివి చేతిలోకి వచ్చాయ్. ఈ లోగా దగ్గొచ్చి ఆపుకోలేక పోయాను. వెనక్కి తిరిగి గతుక్కుమంది. ఏమనుకుందో వెంటనే ఆ గది తలుపు లోపలి గడియ వేసేసి నా రెండు చేతులూ పట్టుకుంది.

"మీరు ఇప్పుడు చూసింది ఎవరితో నైనా చెబితే నన్ను చంపుకు తిన్నట్టే" అంది.

'సరిగ్గా చూసీ చూడనిదే మరుక్షణం నలుగురికీ చేరేస్తే గాని ఉండబట్టదే నా మనసు! అలాంటివి ఇలాంటిది స్పష్టంగా చూశానే. ఎలా ఊరుకో గలను!' అనుకున్నాను. 'ఇంతకీ ఇది చేస్తున్నదేమిటి చెప్మా? ఆ మాట పైకంటే ఈ దొంగ పీనుగ అసలు విషయం కక్కదే, ఏం దారి?' అని తర్కించు కున్నాను కుర్చీలో కూచుని కాళ్ళు ఊపుతూ.

"హుం ఇదన్న మాట ఇక్కడ నువ్వు చేస్తున్న పని? బాగుం దమ్మా—బాగుంది" అన్నాను అదోలా చూస్తూ. ఆమె నా కళ్ళ దగ్గిర పెట్టిమీదకూచుని అందికదా-

"ఏం చెయ్యను బామ్మగారూ! సోడాబుడ్డి దళసరివి ఇంతింత అద్దాలు పెట్టుకొచ్చినందుకు ఇందాక మా తోడికోడలు ఎలా నవ్వుల పాలయిందో చూశారు గదా! బాగా ఖరీదు అయితే అయాయి గాని, ఈ కాంటాక్టు లెన్సులు మా ఆడ వాళ్ళ పరువు కాపాడు తున్నాయి. ఇవి కళ్ళల్లో ఇంచుమించు అమరి పోతాయి గనక, ఇవి ధరించినట్టే ఎదుటి వారికి తెలీదు. అసలు రాత్రి తప్ప ఇవి పైకి తియ్యవలసిన అవసరమే లేదు. ఇందాకట్నుంచి కంట్లో ఏదో పడినట్లై గర గర లాడుతూంటే ఓ సారి ఇవి తీసేసి చల్లటి నీళ్ళతో మొహం కడుక్కుం దామని తీశాను. సమయానికి మీరొస్తారని నాకేం తెలుసూ? తల్లీ, తల్లీ! నా పరువు మీచేతుల్లో పెడుతున్నాను. ఎలా కాపాడు తారో? ముఖ్యంగా మా తోడికో డలికి ఈ కబురు అందకూడదు. పరమ రహశ్యం" ఇంకా రోజా రాణి పెట్టెమీద కూచుందని చెప్పింది గాని, ఆ సరికి భ్రమ రాంబ నేల మీద కూచుని కుర్చీలో కూచున్న బామ్మగారి కాళ్ళు పడు తోంది. "నీకు ఆ కాలపు వాళ్ళంటే ఎంత అభిమానమే భ్రమరం! గుడ్డిముండని కాసుకు న్నాను గాను, ఇలాంటివి నాకెం దుకే, వద్దంటే వినవ్ గదా!" అంటూనే ఆ సరికి రెండో దోసు నెస్కేఫ్ అందుకుంది.

"ఊఁ! చెప్పండి. చెప్పండి. అప్పుడు మీరేమన్నారూ?"

"ఇంతగా అన్యాయంగా నీ మనసు దెబ్బతిన్నాక, దాని జుత్తు పిలక నా చేతిలో చిక్కాక, నేను ఊరుకుంటాననే భ్రమరం! అస లుకే పెట్టేను ఎసరు"

"అంటే?" అంది భ్రమరాంబ అమితోత్సాహంతో.

"అలాగే. ఒక్క సంగతి నువ్వు చెబితే నే నివాళ చూపింది ఎవరితోనూ చెప్పనని మాట ఇవ్వ గలను. ఆ వెంకటరమణ మూర్తి పాదాల పటం ఉంది చూడు, దాని మీద చెయ్యేసి నిజం చెప్పు. నీ వయసెంత?—అని నిలదీశాను" ఆనంద తోనే కాదు, ఆందోళ నతో కూడా భ్రమరాంబ గుండె ఆగినంతపనయింది.

"తను హంతకుడా - కాదా?" అనే జడ్జీ తీర్పుకోసం దోషి ఎదురు చూపినట్టు చూపింది ఆమె. కొంపదీసి రోజారాణి తనకంటే నిజంగా చిన్నది కాదుగదా!

"ఏమంది మా తోడికోడలు? ఏ

మంది బామ్మగారు?" అంది వణుకుతున్న స్వరంతో.

"ఈ ఏడు మేం ఆవకాయ పెట్టుకోడానికి కుదర్లేదే భ్రమరం" అంది తొణక్కుండా.

పిల్లికి బిచ్చం పెట్టని భ్రమరాంబ వంటమనిషిని కేకేసి అప్పటికప్పుడు వంటింట్లో ఉన్న వంద పైగా ఉన్న కూరు ఆవకాయ జాడీ అక్కడ పెట్టించింది.

"ఏవుందీ.. నిజాన్ని దాచలేరెవరూ. మీ తోడికోడలు రోజారాణి పికంటే మూడేళ్ళ మీద నాలుగు నెలలు పెద్ద. పటం మీద చెయ్యేసి తనే చెప్పింది."

అటుపక్క అప్పటికప్పుడు తెప్పించి యిచ్చిన నాలుగు మల్లె పంచెల మూటా, ఇటు ఆవకాయ జాడీ మధ్య రిక్షాలో విక్టోరియా మహారాణిలా కూచున్న బామ్మగారు చిరునవ్వులు వెదజల్లుతూ ఆఖరి సలహా ఇచ్చింది—

"ఈ రాత్రికి పిల్లల్ని గదిలోకి పంపుతారట భ్రమరం. నిన్ను తప్పకుండా రమ్మని ఎంతమంది చెప్పారో. సరదగా గడుపుదాం. రాత్రి అక్కడే ఉండిపోయేలా ఓ గంటలో బయల్దేరి రా అమ్మాయ్! అయితే ఒక్కటి గుర్తుంచుకో. ఇవేవీ మీ తోడికోడల్ని కదపనని నువ్వు నాకు మాట యిచ్చావు. మరచి పోకు. మళ్ళీ నా ఎదాన పడి ఏడుస్తుంది. ఏ కత్రని విప్పుంటే అదే కాల్తుంది. మనకేం? అన్నట్టు బంతులాట ఉందటమ్మోయ్! తలచుకుంటేనే ఒళ్ళు పులకించి పోతోంది. వస్తాను భ్రమరం.... ఇంకా అలాగే ఉన్నావేమిటి? వెర్రిపిల్లా. లేచి స్నానం చేసి ఇంత ఎంగిలి పడు తల్లీ!"

ఆ మర్నాడు పదకొండు గంటల వేళ, రాత్రి జరిగిన డిన్నరుకి హోటలు వాడు పంపిన రెండువేల చిల్లర బిల్లుచూసి ఓ క్షణం కళ్ళు జిగేలుమన్నా వెంటనే నిలదొక్కుకున్నాడు సుందరామ్మూర్తి. బామ్మగారి పని నేర్పు ధర్మమా అని, భారీగా అటూ ఇటూ కొట్టేస్తేనేం, అనుకున్నట్టే అన్నీ చేసింది. భ్రమరాంబ గత రాత్రి పెళ్ళి వారింట్లోనే గడిపింది. డిన్నరు ఎంతో బాగా జరిగింది. మూడువేలదాకా . బాంకిలో జాయింటు ఎకవుంటు ఉంది. అందులోంచి తీసి హోటలు బిల్లు చెల్లించవచ్చు. "హాస్పిటలు కంట్రాక్టు చేతికి చిక్కితే ఇవన్నీ ఓ లెక్కా!" అని అతను అనుకున్నంత సేపు పట్టలేదు. అది మరొకరికి ఇచ్చేశారని ఆ క్షణమే

ఫోన్ అందింది.కాని అసలు ఆపద ముందుందని అతను ఎరగడు.

"ఇంకా అలా చూస్తారేం? పన్నెండుకి మెయిలు. సామాన్లన్నీ సర్దేశాను. గుమస్తాని పంపించి రెండువేల అయిదొందలు విత్‌డ్రా చేయించి, మెడ్రాసుకి రెండు ఫస్ట్ క్లాస్ టికెట్లు తెప్పించాను. వెధవది నాకంటే సహస్రాంతం పెద్ద వాళ్ళే కాంటాక్టు లెన్సులు వాడుతున్నారు-వెంటనే వేయించుకు వద్దాం పదండి'' అంది భ్రమరాంబ తెల్లబోతున్న మొగుణ్ణికుదుపుతూ.*


# శ్రీ బాలాజీ వైద్యశాల

## సెక్సు స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద, ఫోన్: 551, తెనాలి (ఎ.పి.)

బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాస్-17.

దీర్ఘవ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము.



హస్తప్రయోగంవల్ల, అతి సంభోగము వలన అంగము చిన్నదై అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక్క డోస్‌తో ఎన్నడూ, కని విని ఎరుగనంత వీర్యస్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తిచెందు స్త్రీ, పురుషులు వాడదగినది-స్వస్థులు.) హెర్నియా (గిలక) కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి.

క్షయ, ఉబ్బస వ్యాధులకు ఉచిత వైద్యం- రండి.

బ్రాంచీలు:-తిరుపతి, నెల్లూరు గుంటూర్లలో త్వరలో తెరువబడును.